ఉత్సాహంగా వార్షికోత్సవం


శాస్త్రీయ నృత్యం చేస్తున్న విద్యార్థులు

చంపాపేట: చంపాపేట డివిజన్‌ కర్మన్‌ఘాట్‌ ప్రాంతం గాయత్రీనగర్‌ చౌరస్తాలోని నాగార్జున మాంటిసోరీ ఐఐటీ కాన్సెప్ట్‌ పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్‌ గుమ్మికొండ విఠల్‌ రెడ్డి మాట్లాడుతూ..మేడ్చల్‌ కొంపల్లిలో అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో కూడిన నార్త్‌ ఫీల్డ్‌ ఇంటర్‌నేషనల్‌ పేరిట స్కూల్‌ను కూడా ప్రారంభించినట్లు ఆయన స్పష్టం చేశారు. అనంతరం ఆయన చేతుల మీదుగా గతేడాది పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ. 10 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌ సంగమేశ్వరగుప్త, వైస్‌ చైర్‌పర్సన్‌ రజనీవిఠల్‌రెడ్డి, సీఏఓ శేషారావు, డీన్‌ రాజశేఖర్‌, పాఠశాల ప్రిన్సిపల్‌ కట్టా రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి


శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో రాణించి ఆర్థికంగా ఎదగాలని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్‌ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. నాగోలు బండ్లగూడలోని సహభావన టౌన్‌షిప్‌లో మాడిశెట్టి నాగేంద్రయ్య గుప్తా, బూరెల నవీన్‌గుప్తా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్‌ శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉచిత కుట్టు మిషన్‌ శిక్షణ కేంద్రంతో మహిళలకు ఉపాధి లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కుట్టు మిషన్‌ దాతలు తాడేపల్లి వేంకటేశం, స్వర్ణ కుమారీ, ప్రసన్న పాల్గొన్నారు.

ఓపెన్‌ జిమ్‌ ప్రారంభం


ఓపెన్‌ జిమ్‌ ప్రారంభోత్సవంలో మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్‌ మహంకాళమ్మతోట కాలనీ పార్క్‌ స్థలంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్‌ జిమ్‌ను పరిసర కాలనీవాసులు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్‌ వంగ మధుసూదన్‌రెడ్డి కోరారు. రూ 9.50 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన ఓపెన్‌ జిమ్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యోగిరాజ్‌, శేఖర్‌, రాంపురం శ్రీనివాస్‌, అంజి, వినీష్‌, వెంకటేష్‌, అమన్‌సింగ్‌, శ్రీశైలం పాల్గొన్నారు.

జగన్‌కు అండగా ఉంటాం


జగన్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్‌: ఆర్‌కేపురం డివిజన్‌ ఉద్యమకారుడు, బీఆర్‌ఎస్‌ నాయకులు ముచ్చింతల జగన్‌ కు అన్ని విధాలుగా అండగా ఉంటామని మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. గుండెపోటుతో చికిత్స పొందుతున్న జగన్‌ను ఆదివారం ఆమె పరామర్శించి మాట్లాడారు. చిన్న వయసులోనే గుండె పోటు రావడం బాధాకరమని ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట అరవింద్‌ శర్మ, సాజిద్‌, వెంకటేష్‌ గౌడ్‌, పెంబర్తి శ్రీనివాస్‌ ఉన్నారు.

నేటి నుంచి పదో తరగతి ఇంటర్నల్‌ మార్కుల తనిఖీ

చాదర్‌ఘాట్‌: 10వ తరగతి ఇంటర్నల్‌ 20 మార్కుల తనిఖీ సోమవారం నుంచి నిర్వహిస్తున్నట్లు హిమాయత్‌నగర్‌ అంబర్‌పేట డిప్యూటీ డీఈఓ అశ్రఫాతిమా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో జీపీఏ విధానం ఉండేదని ఇప్పుడు ఆ విధానం రద్దయినట్లు వెల్లడించారు. తనిఖీల అనంతరం ఇంటర్నల్‌ మార్కులు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. జీపీఏ విధానం తొలగించి మార్కుల పద్ధతి తీసుకురావడంతో విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతుందన్నారు.


కర్మన్‌ఘాట్‌ శ్రీధ్యానాంజనేయ స్వామివారి ఆలయం

ఆధ్యాత్మిక క్షేత్రం..

ఆన్‌లైన్‌ సేవలకు సిద్ధం

కర్మన్‌ఘాట్‌ ధ్యానాంజనేయ దేవస్థానంలో ఏర్పాట్లు

- ప్రత్యేక పోర్టల్‌కు కృషి
- దూర ప్రాంత భక్తులకు దర్శన సౌలభ్యం

తిరుమల తిరుపతి దేవస్థాన తరహా భక్తులతో కిటకిటలాడే ఆలయాల్లో తక్కువ సమయంలో స్వామివారిని దర్శించుకునే భక్తులకు ఈ–ఆన్‌లైన్‌ ద్వారా ఆర్జిత సేవలను అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఈ నేపథ్యంలోనే నగరానికే తలమానికంగా భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న చంపాపేట డివిజన్‌ కర్మన్‌ఘాట్‌ ధ్యానాంజనేయ స్వామివారి దేవస్థానంలో పలు రకాల ఆర్జిత సేవలను ఆన్‌లైన్‌ ద్వారా అందచేసేందుకు కసరత్తు చేస్తున్నారు. నగరం నలుమూలల నుంచి నిత్యం ధ్యానాంజనేయ స్వామివారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. దూర ప్రాంత భక్తులు ముందస్తుగా స్వామివారికి సేవలు చేసేందుకు ఎలాంటి ఆన్‌లైన్‌ సేవల సదుపాయం ఇప్పటి వరకు అందుబాటులో లేవు. సుదూర ప్రాంత భక్తులు స్వామివారి దర్శనం, ఆర్జిత సేవలు పొందటంలో కాలయాపన లేకుండా వారికి కేటాయించిన సమయంలో స్వామివారికి సేవలు చేసేందుకు ఈ–టికెట్‌ విధానంతో దర్శనాలు, ప్రత్యేక పూజల బుకింగ్‌ అందుబాటులో తీసుకొచ్చేందుకు ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటు చేసేందుకు దేవాదాయ శాఖ కృషి చేస్తుంది.

– చంపాపేట

ఆలయానికి నిత్యం సుమారు 5 నుంచి 6 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు వస్తుంటారు. మంగళ, శనివారాల్లో భక్తుల సంఖ్య 10 వేల నుంచి 12 వేల వరకు ఉంటుంది. ఇక పర్వదినాల్లో ఆలయం మొత్తం భక్తులతో కిటకిటలాడుతుంది. ఆలయానికి భక్తుల కానుకల రూపంలో సంవత్సరానికి రూ. 4 నుంచి రూ.5 కోట్ల వరకు ఆదాయం ఉంటుంది. ధ్యానాంజనేయే స్వామివారి ఆలయ ఈ–సేవల పోర్టల్‌లో కల్యాణ మండపం, వీఐపీ దర్శనాలు, స్వామివారికి ఆర్జిత సేవలు, నిత్యాన్నదాన, వివరాలను పొందుబరుస్తున్నారు.

స్వామివారి సేవల వివరాలు

ప్రతీ మంగళ, శనివారాల్లో ఉదయం గం 5.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సాయంత్రం 4.30 నుంచి రాత్రి 9 వరకు, మిగిలిన వారాల్లో ఉదయం 6 నుంచి 12 గంటల వరకు సాయంత్రం 4.30 నుంచి 8.30 వరకు ఆలయ పనిదినాల్లో స్వామివారి సేవల సమయాలు ఉంటాయి. నిత్యం ఉదయం 6 గంటల నుంచి 8 వరకు సుప్రభాత సేవ, నాద నీరాజనం, అభిషేకం, నివేదన, మంత్రపుష్పం, తీర్థప్రసాదాల వినియోగం. 8 నుంచి 11.30 గంటల వరకు భక్తులకు సాధారణ దర్శనం, అర్చనలు. ప్రతీ శని, మంగళవారాల్లో 9 నుంచి 10 గంటల వరకు స్వామివారికి ఆలయ అర్చకులు, వేదపండితుల మంత్రోచ్చరణలతో ప్రత్యేక పూజలు. 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు దర్శనాలు, మహానివేదన. సాయంత్రం 4.30 నుంచి 9 గంటల వరకు దర్శనాలు, అర్చనలు, మంగళహారతి. ఆరాదన, నివేదన, మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాదాల వితరణ, పవళింపు సేవ, రాత్రి 9 గంటలకు ఆలయం మూసివేత.

ఆన్‌లైన్‌లో ఆర్జిత సేవలు

ఉదయం 7 గంటల అనంతరం సింధూర అభిషేకం రూ 600, అర్చన రూ 50, ఆకుపూజ రూ. 100, వెండి ఆకుపూజ, నవగ్రహ రూ 150, సువర్ణ పుష్పార్చన రూ 200, టెంకాయ ముడుపు రూ. 200, రుద్రాభిషేకం రూ. 200, అక్షరాభ్యాసం, అన్నప్రాసన రూ 200, సహస్ర నామార్చన రూ 400, ఉపాలయాల అభిషేకాలు రూ 400, సత్యనారాయణ స్వామివారి వ్రతం ఉదయం '10.30 లకు రూ 500, మండల పూజ రూ 600, వార్షిక అర్చన రూ 2500, వాహన పూజ ద్విచక్ర వాహనం, ఆటో రూ 150, కారుపూజ రూ. 300, భారీ వాహనాలు రూ 400, వేద పండితుల ఆశీర్వచనాలు రూ. 516, పల్లకీ సేవ (ప్రతీ మంగళ, శనివారాల్లో సాయంత్రం 7 గంటలకు) రూ. 1116, గణపతి, చండీ, మన్యుసూక్త, సుదర్శన, ఆదిత్య హోమాలు రూ.516, శ్రీసీతారామ కల్యాణం(ప్రతీ పునర్వస నక్షత్రం రోజు) రూ. 1116, 40 మంది భక్తులకు అన్నదానాలు రూ. 2000, వారంలో ఒకరోజు పది సంవత్సరాల పాటు రూ 5000, పులిహోర ఒక కేజీ భోగం రూ 400, రవ్వకేసరి భోగం, రూ. 500, శాశ్వత నిత్యాన్నదాన మహారాజ పోషకులు రూ. లక్ష, రాజ పోషకులు రూ 50,000.

త్వరలో ఆన్‌లైన్‌ సేవలకు శ్రీకారం



గతంలో విధులు నిర్వర్తించిన రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్‌ మంత్రిప్రగడ హన్మంతరావు ప్రత్యేక శ్రద్ధతో ఆలయంలో ఈ–ఆన్‌లైన్‌ సేవలు కల్పించాలని ఆదేశాలు జారీ చేసి కార్యాచరణ కూడా ప్రారంభించారు. ఆన్‌లైన్‌ సేవల పోర్టల్‌లో అప్‌లోడ్‌ పనులు కూడా 90 శాతం పూర్తయ్యాయి. సిబ్బంది కొరతతో కొంత మేర జాప్యం అయింది. త్వరలో ఆలయానికి సంబధించిన ప్రత్యేక పోర్టల్‌ ద్వారా దేశ, విదేశాల్లో ఉన్న భక్తులు కూడా ఆన్‌లైన్‌లో ఆర్జిత సేవలను ప్రత్యక్ష, పరోక్షంగా పొందే సౌలభ్యం కల్పిస్తాం.

– ఈఓ. లావణ్య

రక్తదానం ప్రాణదానంతో సమానం


సర్టిఫికెట్లు అందజేస్తున్న పవన్‌కుమార్‌

నాగోలు: రక్తదానం ప్రాణదానంతో సమానమని కొత్తపేట డివిజన్‌ కార్పొరేటర్‌ నాయికోటి పవన్‌కుమార్‌ అన్నారు. మోహన్‌నగర్‌లో ఆర్బీఐ కాలనీలో యువ సేన ట్రస్ట్‌ ఆధ్వర్యంలో మిత్ర బ్లడ్‌ బ్యాంక్‌ సహకారంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని కార్పొరేటర్‌ ప్రారంభించి మాట్లాడారు. రక్తాన్ని కృత్రిమంగా సృష్టించలేమని అందుకే రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్‌ సభ్యులు నాయకులు సైదులు బాబాయ్‌, సురేష్‌, రామ రెవెల్లి, నాయకులు సుందర్‌ నారాయణ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలి


రంగనాథ్‌ను సన్మానిస్తున్న క్లబ్‌ సభ్యులు

నాగోలు: పేద ప్రజలకు అండగా నిలుస్తూ నిరంతరం సేవా కార్యక్రమాలకు కొనసాగించాలని హైడ్రా కమిషనర్‌ ఏవీ.రంగనాథ్‌ పేర్కొన్నారు. ఆదివారం నగరంలో నిర్వహించిన పటేల్‌ రీజినల్‌ మీట్‌ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పటేల్‌ రీజినల్‌ క్లబ్‌ మీట్‌ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం పట్ల అభినందించారు. అన్ని వర్గాల ప్రజలకు సేవ చేసేందుకు ఈ క్లబ్‌ అగ్రభాగాన ఉండాలని ఆకాంక్షించారు. మానవసేవే మాధవసేవ అనే దానికి ఈ క్లబ్‌ ఆదర్శంగా నిలవాలని సూచించారు. సందర్భంగా హైడ్రా కమిషనర్‌ రంగనాథ్‌ను మిరియాల చంద్రమోహన్‌, వినయలత దంపతులు సత్కరించారు.

చిరు వ్యాపారుల ఉపాధికి ఆటంకం కలిగించొద్దు


మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

వనస్థలిపురం: వనస్థలిపురం రైతుబజారు వద్ద చిరు వ్యాపారుల ఉపాధికి ఆటంకం కలిగించొద్దని సీఐటీయూ నాయకులు పరిసర కాలనీల సంక్షేమ సంఘాల నాయకులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం వనస్థలిపురం రైతుబజార్‌ వద్ద సీఐటీయూ నాయకులు చిరు వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రమోహన్‌ మాట్లాడుతూ.. గత 30 ఏళ్లుగా చిరు వ్యాపారులు రైతుబజారు కూడలి వద్ద పూలు, పండ్లు అమ్ముతూ జీవనోపాధి పొందుతున్నారని ట్రాఫిక్‌ ఇబ్బందుల పేరుతో పరిసర కాలనీల ప్రజలు ఫిర్యాదు చేయడంతో జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్‌ అధికారులు తోపుడు బండ్లు, షెడ్లను తొలగించడంతో 130 కుటుంబాలు జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడ్డాయన్నారు. మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్‌ చొరవతో అధికారులు తోపుడు బండ్లు పెట్టుకోవడానికి అవకాశం ఇచ్చారని, కానీ మళ్లీ కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు చిరు వ్యాపారాలను అడ్డుకోవాలని చూస్తున్నారన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వ్యాపారాలు కొనసాగేలా ఎమ్మెల్యే, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఎల్లయ్య, భారతమ్మ, చిన్న, శ్రీను, కోటేశ్వరరావు, జయమ్మ, నరసమ్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

బడ్జెట్‌ వ్యతిరేక ప్రదర్శనను జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న యాదగిరి

మన్సూరాబాద్‌: కేంద్ర ప్రభుత్వం కార్మిక సంక్షేమానికి రూపాయి కూడా కేటాయించకుండా, రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పించకుండా కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదగిరి విమర్శించారు. కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ఈ నెల 10న జరిగే నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరుతూ మన్సూరాబాద్‌ జడ్జెస్‌ కాలనీలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో వ్యవసాయ కూలీలు, ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేకుండా బడ్జెట్‌ ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం తన ఇష్టానురీతిలో వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో కీసరి నర్సిరెడ్డి, కృష్ణయ్య, మల్లేషం, సంధ్య, కనకయ్య, శాంతి పాల్గొన్నారు.

సీనియర్‌ సిటిజన్‌ క్లబ్‌కు నిధుల కేటాయింపు


పరమేశ్వర్‌రెడ్డితో క్లబ్‌ ప్రతినిధులు

ఉప్పల్‌: సీనియర్‌ సిటిజన్‌లకు అండగా ఉంటూ వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని కాంగ్రెస్‌ పార్టీ ఉప్పల్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఉప్పల్‌ సీనియర్‌ సిటిజన్‌ క్లబ్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 20 లక్షలు కేటాయించడంపై వారు పరమేశ్వర్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉప్పల్‌ మెయిన్‌రోడ్డులో ఇప్పటికే క్లబ్‌ నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించినట్లు వివరించారు. మేకల రాంరెడ్డి, వెంకటయ్యగౌడ్‌, మనోహర్‌, కుమారస్వామి, నారాయణగౌడ్‌, నర్సింహారెడ్డి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణకు సన్మానం


మందకృష్ణ మాదిగకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

నాగోలు: ఎమ్మార్పీఎస్‌ అధినేత మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ, ఎస్సీ వర్గీకరణ సాధించిన సందర్భంగా ఎల్‌బీనగర్‌ నియోజకవర్గం రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన బీఆర్‌ఎస్‌ పార్టీ ఎస్సీసెల్‌ రాష్ట్ర కార్యదర్శి మల్లె పాక యాదగిరి ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..
మందకృష్ణ మాదిగ గత 30 ఏళ్లుగా పోరాటం చేసి వర్గీకరణ సాధించారన్నారు. దేశంలోనే శాంతియుత పోరాటాల ద్వారా సాధించిన గొప్ప నాయకుడు మందకృష్ణ మాదిగ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మహేష్‌, యాదయ్య, అనిత, నిర్మల, దుంప విజయలక్ష్మి, చంద్రశేఖర్‌ పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు చెక్కుల పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్‌: ప్రభుత్వ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే బలాల సూచించారు. ఆదివారం ఓల్డ్‌మలక్‌పేటలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన 20 స్వయం సహాయ మహిళా గ్రూపులకు ఒక్కో గ్రూపునకు రూ. లక్ష చొప్పున పంపిణీ చేశారు. కార్యక్రమంలో డివిజన్‌ కార్పొరేటర్‌ షఫీఉద్దీన్‌, ఎంఐఎం నాయకులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ ఆవరణలో పాము కలకలం


పామును పట్టుకున్న వెంకటేష్‌నాయక్‌

మలక్‌పేట: మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌ ఆవరణలో ఆదివారం పాము కలకలం రేపింది. స్టేషన్‌ ముందు పాము ఉన్నట్లు గమనించిన సిబ్బంది మలక్‌పేట ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటేష్‌ నాయక్‌ పాములు పట్టుకుంటాడని తెలిసి ఆయనను పిలిపించారు. అక్కడికి చేరుకున్న వెంకటేష్‌ నాయక్‌ నాలుగు ఫీట్ల పొడవున్న పాము (జెర్రిపోతు) పట్టుకుని ఫారెస్ట్‌ అధికారులకు అప్పగించాడు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ఎల్‌బీనగర్‌: లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ హైదరాబాద్‌ వనస్థలిక్రాంతి అండ్‌ లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ ఇబ్రహీంపటణం వారి ఆధ్వర్యంలో రంగారెడ్డి హెల్త్‌ కేర్‌ హాస్పిటల్‌ సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి బీఎన్‌రెడ్డినగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ మొద్దు లచ్చిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలు ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పరిగూడ ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం చైర్మన్‌ లయన్‌ పాండురంగారెడ్డి, గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరిరావు, మర్మరాజు, శ్యాంప్రసాద్‌, లక్ష్మీమూర్తి, వాసుదేవరావు, సాధుకృష్ణ, కిశోర్‌, బాలరాజు, భీమ్‌రావు, సంధ్యారాణి, డాక్టర్‌ తేజస్వినిరెడ్డి పాల్గొన్నారు.

కుల గణనను రీ సర్వే చేయాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

మన్సూరాబాద్‌: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణనపై అనేక అనుమానాలు ఉన్నాయని, కులగణను రీసర్వే చేయాలని సోషల్‌ జస్టిస్‌ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు డిమాండ్‌ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన బీసీ కులగణన లెక్కలు తప్పుగా ఉన్నాయని నిరసిస్తూ ఎల్‌బీనగర్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేలో అనేక లోపాలున్నాయని మండిపడ్డారు. తెలంగాణలో బీసీల జనాభాను తగ్గించే ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్‌, బాలస్వామి, అనిల్‌, నరేందర్‌, శ్యామ్‌సుందర్‌గౌడ్‌, శ్రీధర్‌ పాల్గొన్నారు.

స్మార్ట్‌ బిన్లను సద్వినియోగం చేసుకోవాలి


స్మార్ట్‌ బిన్లు ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌

చాదర్‌ఘాట్‌: గార్బేజ్‌ స్మార్ట్‌ బిన్‌లను కాలనీవాసులు సద్వినియోగం చేసుకుని చెత్తరహిత డివిజన్‌గా ఏర్పాటు చేసుకోవాలని సర్కిల్‌–6 ఏఎంహెచ్‌ఓ రుద్ర శ్రీనివాస్‌ అన్నారు. ఆదివారం అజంపురా డివిజన్‌ కాలడేరా, జిట్‌ఫట్‌ నగర్‌ ప్రాంతాల్లో గార్బేజ్‌ స్మార్ట్‌ బిన్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో చెత్త పాయింట్లను గుర్తించి 8 స్మార్ట్‌ బిన్‌లను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఎంఐఎం డివిజన్‌ అధ్యక్షుడు అబ్రహార్‌ మాట్లాడుతూ.. గార్బేజ్‌ బిన్లను కాలనీవాసులు వినియోగించుకోవాలని సూచించారు.

వాటర్‌బోర్డులో ఓపెన్‌ టెండర్‌ విధానాన్ని అమలు చేయాలి


మంత్రికి మెమోరాండం అందజేస్తున్న పోల్కం శ్రీనివాస్‌

అబిడ్స్‌: వాటర్‌బోర్డులో ఓపెన్‌ టెండర్‌ విధానాన్ని అమలు చేయాలని టీపీసీసీ ఓబీసీ సెల్‌ ప్రధాన కార్యదర్శి, వాటర్‌బోర్డు కాంట్రాక్టర్స్‌ జేఏసీ మీడియా ఇన్‌చార్జి పోల్కం శ్రీనివాస్‌ డిమాండ్‌ చేశారు. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో వాటర్‌బోర్డులో ఏఎంఎస్‌ విధానం అమలు చేయడం ద్వారా వేలాది మంది కాంట్రాక్టర్లు రోడ్డుపాలై అప్పులపాలయ్యారని ఆయన ఆరోపించారు. ఆదివారం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా పోల్కం శ్రీనివాస్‌ మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రంలో ఇరిగేషన్‌, ఆర్‌అండ్‌బీ ఇతర పలు శాఖలలో ఓపెన్‌ టెండర్‌ విధానం అమలులో ఉందన్నారు. కేవలం కొంతమంది అధికారుల కక్కుర్తి కోసం గత బీఆర్‌ఎస్‌ సమయంలో వాటర్‌బోర్డులో ఏఎంఎస్‌ విధానం అమలు చేశారని ఆయన ఆరోపించారు. ఏఎంఎస్‌ విధానం ద్వారా లక్షలాది రూపాయాల అవినీతి జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌ రెడ్డి సానుకూలంగా స్పందించారు. తాను వాటర్‌బోర్డు ఎండీతో మాట్లాడి న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శనతో కళాకారులు

ఉప్పల్‌: ఉప్పల్‌ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతి కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శృతిలయ డాన్స్‌ అకాడమీ గురువు మంజు మోహిని శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. రోహిణి, శాంతి, నళినాక్షి, హాసిని, అనన్య తదితరులు కాళింగ నర్తన, నాట్య హెల్త్‌ కొలువై ఉన్నాడే, జయజయ దుర్గే తదితర అంశాలు ప్రదర్శించి మెప్పించారు.